సాక్షి
సిద్దిపేట
శనివారం । 10 । ఆగస్టు । 2024



కోటిపడగల సంతాన నాగదేవత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సరస్వతి సన్నిధిలో 'అక్షర' హోరు

- భారీగా చిన్నారుల అక్షరాభ్యాసాలు



చిన్నారుల అక్షరాభ్యాసాల సందడి, (ఇన్‌సెట్‌లో) విశేష అలంకరణలో అమ్మవారు

శ్రావణ శుక్రవారం వేళ వర్గల్ విద్యా సరస్వతి క్షేత్రం చిన్నారుల అక్షరాభ్యాసాలతో హోరెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు చదువుల తల్లి సన్నిధిలో తమ చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరిపించారు. విశేషాలంకృతులైన అమ్మవారిని దర్శించుకున్నారు. క్షేత్రంలో 300పైగా చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరిగినట్లు ఆలయ మేనేజర్ రఘుపవన్ తెలిపారు. – వర్గల్(గజ్వేల్):

భక్తిశ్రద్ధలతో నాగపంచమి



నాగ ప్రతిమపై పాలుపోస్తున్న మహిళలు



నాగుల పంచమిని జిల్లా ప్రజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచే ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. పుట్టల వద్ద పాలు పోసి, దీపాలు వెలిగించి, నైవేద్యాలు సమర్పించారు. అమ్మవార్లను దర్శించుకున్నారు. జిల్లా కేంద్రంలోని కోటి పడగల సంతాన నాగదేవత ఆలయంలో వివిధ పార్టీల నేతలు పూజలు చేశారు. – ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

న్యూస్‌రీల్

పలువురు ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్ల బదిలీ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా పలు పీఎస్‌లలో విధులు నిర్వర్తిస్తున్న 16 మంది ఏఎస్‌ఐలు, 42 మంది హెడ్ కానిస్టేబుళ్లను బదిలీ చేసినట్లు పేర్కొన్నారు.

విజయ డెయిరీ సిబ్బంది నిర్బంధం



మాచాపూర్‌లోని పాల కేంద్రంలో సిబ్బందిని నిర్బంధించిన రైతులు

చిన్నకోడూరు(సిద్దిపేట): పాల డబ్బులు చెల్లించాలంటూ రైతులు విజయ డెయిరీ సిబ్బందిని నిర్బంధించారు. మండల పరిధిలోని మాచాపూర్‌లో 40 మంది పాడి రైతులకు రూ.2 లక్షల మేర చెల్లించాలని వారు తెలిపారు. విషయం తెలుసుకున్న విజయ డెయిరీ జిల్లా మేనేజర్ శరణ్య ఫోన్‌లో రైతులతో మాట్లాడారు. రెండు రోజుల్లోగా డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు వారిని వదిలిపెట్టారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



పుస్తకాలను ప్రదర్శిస్తున్న కవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవరుచుకోవాలని కృష్ణం వందే జగద్గురు సాహితీ సంస్థ అధ్యక్షుడు సింగీతం నరసింహారావు అన్నారు. జాతీయ పుస్తక ప్రియుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం సిద్దిపేటలో జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. నరసింహారావు మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా చిన్నారులలో పద సంపద అలవడుతుందన్నారు. ఎలాంటి సాంకేతిక యుగాలు వచ్చినా పుస్తక పఠనం మాత్రం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జాసాప అధ్యక్షులు ఎన్నవెల్లి రాజమౌళి, బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం, బస్వ రాజ్ కుమార్, ఉండ్రాళ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కాలువల నిర్మాణానికి అనుమతులు

హుస్నాబాద్: గౌరవెల్లి రిజర్వాయర్ కాలువల నిర్మాణం కోసం పరిపాలన అనుమతులు ఇచ్చినట్లు రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పెండింగ్ పనుల కోసం సవరించిన అంచనా మేరకు రూ.431.30 కోట్లు విడుదల చేశారు. గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా 1.06లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు చర్యలు చేపడుతున్నారు. తాజాగా టెండర్లు పిలవడానికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని ఉత్తర్వుల్లో తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

హుస్నాబాద్: పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇళ్లు లేని పేద కోసం డబుల్ బెడ్రూం పథకం తీసుకువచ్చి అండగా నిలిచిందన్నారు. చివరి దశలో ఉన్న ఈ నిర్మాణాలు ఎమ్మెల్యే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు పెండింగ్‌లో పడ్డాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కోరారు.

వామ్మో.. ఆ సీటా?!



సిద్దిపేట మున్సిపాలిటీ అంటేనే అధికారులు హడలెత్తుతున్నారు. ఇక్కడ విధులు నిర్వర్తించడానికి జంకుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం రాజకీయ ఒత్తిడిలే కారణమన్న ప్రచారం జరుగుతోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో స్పెషల్ గ్రేడ్ కమిషనర్ హోదాలో ఉన్న సంధ్యను ఇటీవల సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ ప్రసన్న రాణి గ్రేటర్ వరంగల్‌కు బదిలీ అయిన విషయం విదితమే. అయితే కమిషనర్‌గా సంధ్య ఇప్పటి వరకు బాధ్యతలు స్వీకరించలేదు. ఇక్కడకు వచ్చేందుకు సుముఖంగా లేరని సమాచారం. ఆరోగ్య కారణాల రీత్యా రావడం లేదని కొందరు అంటుండగా, రాజకీయ ఒత్తిడిలే కారణమని మరికొందరు చర్చించుకోవడం గమనార్హం. – సాక్షి, సిద్దిపేట

సిద్దిపేట మున్సిపాలిటీ అంటేనే అధికారుల్లో హడల్

- ఇటీవల కమిషనర్‌గా సంధ్య నియామకం
- ఇప్పటి వరకు విధుల్లో చేరని అధికారి
- రాజకీయ ఒత్తిళ్లే కారణమంటూ ప్రచారం
- కీలక అధికారి లేక కుంటుపడుతున్న పాలన

సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా పని చేసేందుకు అధికారులు గతంలో ఆసక్తి చూపించేవారు. ఇతర శాఖల నుంచి సైతం డిప్యుటేషన్‌పై వచ్చి విధులు నిర్వర్తించారు. కానీ ఇప్పుడా పరిస్థితిలో మార్పు వచ్చింది. చివరకు మున్సిపల్ శాఖ వారిని నియమించినా ఛార్జ్ తీసుకునేందుకు వెనుకంజవేస్తున్నారని సమాచారం. విధి నిర్వహణలో పట్టణంలో అధికార, ప్రతిపక్ష నాయకులతో తలనొప్పి ఉంటుందనే భావన నెలకొనడమే ఇందుకు కారణంగా జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఇటీవల బదిలీపై వెళ్లిన కమిషనర్‌కు ఎదురైన చేదు అనుభవాలను ఇందుకు ఉదాహరణగా పేర్కొంటున్నారు. మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో అప్పటి కమిషనర్‌ను అవమానించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై వచ్చిన ఫిర్యాదుపై సీడీఎంఏ అధికారులు విచారణ కూడా చేశారు.

పేరుకుపోతున్న ఫైళ్లు

ప్రసన్న రాణి బదిలీపై వెళ్లడంతో ఇన్‌ఛార్జి కమిషనర్‌గా ప్రేరణ పాండ బాధ్యతలు చేపట్టారు. పూర్తి స్థాయిలో బాధ్యతలు లేకపోవడంతో పలు ఫైళ్లు పేరుకుపోతున్నాయి. జిల్లాలోనే పెద్ద మున్సిపాలిటీ, దేశంలోనే ఆదర్శ మున్సిపాలిటీలలో సిద్దిపేట ఒకటి. పట్టణంలో 43 వార్డుల్లో 1.5లక్షలకు పైగా జనాభా ఉంటోంది. మున్సిపల్ నుంచి జారీ చేసే ప్రతి సర్టిఫికెట్‌కు డిజిటల్ సంతకం తప్పనిసరి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అలాగే భవన నిర్మాణ అనుమతులు, మ్యూటేషన్లు, అసిస్‌మెంట్లు, బిల్లులు నిలిచిపోయాయి.



సిద్దిపేట మున్సిపాలిటీ

బదిలీల్లో కమిషనర్‌గా నియమితులైన సంధ్య జాయిన్ అవుతుందా... ఇంకా ఎవరినైనా కొత్త వారిని నియమిస్తారా? అన్నది వేచిచూడాల్సిందే.

సాధారణ బదిలీల్లో మొగ్గుచూపని సిబ్బంది

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో సిద్దిపేట మున్సిపాలిటీ నుంచి ఎనిమిది మంది ఉద్యోగులు బదిలీ కాగా నలుగురు మాత్రమే వచ్చారు. సిద్దిపేట మున్సిపాలిటీలో 206 పోస్టులు మంజూరైతే 78 మందే ఉన్నారు. ఇంకా 128 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

- గజ్వేల్ మున్సిపాలిటీలో 72 పోస్టులు మంజూరు కాగా 35 మందే ఉన్నారు. ఇంకా 37 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 62 పోస్టులు మంజూరు అయ్యాయి. అందులో 30 మంది మాత్రమే ఉన్నారు. ఇంకా 32 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.
- దుబ్బాక మున్సిపాలిటీలో 47 పోస్టులు మంజూరు కాగా 25 మందే ఉన్నారు. 22 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- చేర్యాల మున్సిపాలిటీలో కమిషనర్ పోస్టే మంజూరు లేదు. ఇతర పోస్టులు సైతం మున్సిపాలిటీ స్థాయికి తగ్గట్టు పోస్టులు మంజూరు కాలేదు. ఈ పోస్టులు భర్తీ కాకపోవడంతో ఉన్న వారిపైనే పనిభారం పడుతోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- వ్యవసాయ అనుబంధ రంగాల పథకాలపై అవగాహన

కోహెడ(హుస్నాబాద్): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు, మహిళా సంఘాలకు వ్యవసాయ అనుబంధ రంగాల పథకాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి హాజరై మాట్లాడారు. బీడు భూములు లేకుండా పండ్లతోటలు, ఆయిల్‌పామ్ సాగు చేయాలన్నారు. అలాగే పశుపోషణలో గొర్రెలు, చేపలు, కోళ్లు, పందులు తదితర పెంపకంతో లబ్ధి పొందాలన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పెండింగ్ పనుల నిర్మాణం కోసం ఇటీవల నిధులు మంజూరు అయ్యాయన్నారు. పంటలకు సాగు నీరు త్వరలోనే అందించేందుకు కృషి చేస్తామన్నారు. అంతకు ముందు స్టీల్ బ్యాంక్ ను ప్రారంభించారు. నియోజకవర్గాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, గ్రామీణాభివృద్ధి జిల్లా అధికారి జయదేవ్ ఆర్యా, జిల్లా వ్యవసాయ అధికారి ప్రభాకర్, ఏడీఏ మహేశ్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరీశ్, జిల్లా పశు వైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సురేఖ, పశువైద్యాధికారి శ్రావణ్, ఎంపీడీఓ కృష్ణయ్య, ఏపీఎం తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

అధిక ఆదాయం వచ్చే పంటలనే సాగు చేయండి

కోహెడరూరల్(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందని, ఇప్పటికే రూ.1.50 లక్షల వరకు మాఫీ చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని బస్వాపూర్‌లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయేతర రంగాల్లో స్థిరత్వం సాధించాలన్నారు. పొలాల్లో మందులు చల్లడానికి డ్రోన్ లాంటివి వస్తున్నాయని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మరింత సాంకేతికత జోడించి వ్యవసాయం చేయాలన్నారు. అధిక ఆదాయం వచ్చే పంటలపై దృష్టి సారించాలని సూచించారు. ఆయిల్‌పామ్, డ్రాగన్ ఫ్రూట్, కూరగాయాలు, మామిడి లాంటి పంటలను సాగు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



గోల్డ్ కలర్ పంచె కట్టుతో మంత్రి పొన్నం

మంత్రి పొన్నం నక్షత్ర దీక్ష

హుస్నాబాద్: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం వీరభద్రస్వామి నక్షత్ర దీక్ష స్వీకరించారు. నియోజకవర్గంలోని కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయంలో స్వామివారి నక్షత్ర దీక్షను స్వీకరించారు. 27 రోజుల పాటు నియమ నిష్ఠలతో ఉండనున్నారు. గతంలో వీరభద్రస్వామి ఆలయానికి వచ్చినప్పుడు శాసన సభ్యుడిగా గెలిస్తే మాల దీక్ష స్వీకరిస్తానని మొక్కుకున్నారు. ఇప్పుడు నక్షత్ర దీక్ష చేపట్టారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఈ దీక్ష చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ దీక్షలోనే నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు.

రైతులపై మొసలి కన్నీరు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు

చిన్నకోడూరు(సిద్దిపేట): అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోని ఎమ్మెల్యే హరీశ్‌రావు అధికారం పోగానే రైతుల పేరుతో డ్రామాలు ఆడుతున్నరాని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు ఆరోపించారు. శుక్రవారం చిన్నకోడూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రిగా ఉన్నప్పుడు సిద్దిపేట నియోజకవర్గంలోని రంగనాయక సాగర్, అన్నపూర్ణ ప్రాజెక్టుల నుంచి కాలువలు తవ్వి చెరువులు నింపకుండా కాలయాపన చేశారన్నారు. అధికారం పోయాక రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. తాను లేఖ రాస్తేనే ప్రభుత్వం గోదావరి జలాలు ప్రాజెక్టులకు విడుదల చేసిందని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. రైతులపై ప్రేమ ఉంటే కాలువలకు భూసేకరణ చేయించి, కాలువలు తవ్వడానికి ప్రభుత్వానికి సహకరించాలన్నారు. సమావేశంలో నాయకులు మహేందర్, గణేష్, పర్శరాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త స్తంభాల ఏర్పాటు

యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టిన విద్యుత్ అధికారులు

దుబ్బాక: పొలాల్లో కూలిన విద్యుత్ స్తంభాలు.. తప్పిన ప్రమాదం శీర్షికన శుక్రవారం సాక్షిలో వచ్చిన కథనంతో విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించారు. శుక్రవారం ఉదయమే విద్యుత్ ఏడీఈ పండరి, ఏఈ రామాంజనేయులు, కాంట్రాక్టర్ వెంకటరెడ్డిలతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పొలాల్లో కూలిన విద్యుత్ స్తంభాల వద్దకు చేరుకున్నారు. యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు. విరిగిపడిన స్తంభాల స్థానంలో కొత్తవి వేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా తమ సమస్యను వెలుగులోకి తెచ్చి వెంటనే పరిష్కరించేలా చేసిన సాక్షికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్



కొత్త స్తంభాలు వేసి వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్న సిబ్బంది

'స్వచ్ఛదనం' నిరంతర ప్రక్రియ



గురుకులంలో మొక్కను నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ మనుచౌదరి

- సామాజిక బాధ్యతగా అలవర్చుకోవాలి
- కలెక్టర్ మనుచౌదరి పిలుపు
- గురుకులంలో మొక్కలు నాటిన కలెక్టర్

వర్గల్(గజ్వేల్): స్వచ్ఛదనం పచ్చదనం నిరంతర ప్రక్రియ అని, పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటి సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా అలవరచుకోవాలని కలెక్టర్ మను చౌదరి అన్నారు. శుక్రవారం వర్గల్ జ్యోతిబా పూలే బాలికల గురుకుల కళాశాల ఆవరణలో నిర్వహించిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్సీఓ ప్రభాకర్, ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. ఆవరణలో విద్యార్థులు పెంచుతున్న మెడిసినల్ ప్లాంట్స్ గార్డెన్ పరిశీలించి అభినందించారు. ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం సామాజిక బాధ్యత కావాలని, ప్రతి ఒక్కరూ పుట్టినరోజు తదితర ప్రత్యేక దినోత్సవాలలో ఇంట్లో, పాఠశాలల్లో, పరిసరాలలో మొక్కను నాటి సంరక్షించాలన్నారు. పరిశుభ్రత వ్యాధులను దూరం చేస్తుందని, మొక్కలు వృక్షాలైతే ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందన్నారు. ఇదొక నిరంతర ప్రక్రియగా విద్యార్థిలోకం ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాస్కర్ రావు, జిల్లా అటవీఅధికారి శ్రీనివాస్, వర్గల్ మండలం ప్రత్యేకాధికారి కవిత, తహశీల్దార్ బాలరాజు, ఎంపీడీవో విజయలక్ష్మి, గురుకుల అధ్యాపకులు, సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. మొక్కలు నాటారు.

క్యాండిల్ వెలుతురులో చదువులు కొనసాగించా..

తన చిన్నతనంలో రాత్రి వేళల్లో కరెంటు కోతలు బాగా ఉండేవని, క్యాండిల్ వెలుతురులో నైట్ అంతా చదివానని, అప్పుడప్పుడు చాలా కష్టంగా ఉండేదని కలెక్టర్ తన పాత జ్ఞాపకాలను విద్యార్థులతో పంచుకున్నారు. విద్యార్థినులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ మనం ఎంచుకున్న మార్గంలో జంకు లేకుండా ముందుకు సాగాలన్నారు. డెడికేషన్, డిటర్మినేషన్, హార్డ్ వర్క్ వందకువంద శాతం దృష్టి పెట్టినపుడే ఆశించిన లక్ష్యాలు సిద్ధిస్తాయని విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం టిస్ట్ విద్యార్థినులు ఫిజిక్స్ సబ్జెక్టుపై పట్టు ఎలా సాధించాలో వివరించారు.

కేంద్ర బృందం పర్యటన



గాగిల్లాపూర్‌లో వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

బెజ్జంకి(సిద్దిపేట): హర్ ఘర్ జల్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గాగిల్లాపూర్, గుండారం గ్రామాల్లో జల్ జీవన్ కేంద్ర బృందం సభ్యులు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు రమేశ్, సాహెబ్ ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఎల్లప్పుడూ స్వచ్ఛమైన నీటినే తీసుకోవాలని, అప్పుడే రోగాల బారిన పడకుండా ఉంటామన్నారు. గ్రామాల్లో నీటి ట్యాంకులు శుద్ధి చేయాలని అధికారులను సూచించారు. గ్రామాల్లో శుద్ధి నీటిని సరఫరా చేయాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమాలలో మిషన్ భగీరథ డీఈ వీణ తస్విన్, ఏఈ రేణుక, ల్యాబ్ టెక్నిషియన్ రాజ్‌కుమార్, ప్రభాకర్, కార్యదర్శి ప్రసాద్, మాజీ ప్రజా ప్రతినిధులు సత్యనారాయణరెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిత్యశ్రీ జిల్లాకే గర్వకారణం

అభినందించిన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



నిత్యశ్రీని అభినందిస్తున్న వెంకటేశ్వర్లు

మెదక్ కలెక్టరేట్: మార్షల్ ఆర్ట్స్ కరాటే అంతర్జాతీయ చాంపియన్‌షిప్–2024లో బంగారు పతకాన్ని సాధించిన నామ నిత్యశ్రీ జిల్లాకే గర్వకారణమని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆమెను అభినందించారు. హైదరాబాద్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీల్లో 30 దేశాల నుంచి 3000 మంది బ్లాక్ బెల్ట్ సాధించిన వారు పాల్గొనగా మన జిల్లా నుంచి నిత్యశ్రీ పాల్గొని బంగారు పతకాన్ని సాధించడం సంతోషకరమన్నారు. అనంతరం నగేశ్, దినకర్ మాస్టర్లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీఓ కరుణశీల, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపులు తనిఖీ

బియ్యాన్ని పరిశీలించిన అధికారులు



రేషన్ షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

అల్లాదుర్గం(మెదక్): ‘డీలర్లకు బియ్యం కోత’ అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ టెక్నికల్ అధికారి ప్రశాంత్, పెద్దశంకరంపేట పౌర సరఫరా గోదాం ఇన్‌చార్జి దత్తురెడ్డి, స్థానిక రెవెన్యూ అధికారులు అల్లాదుర్గంలో రేషన్ షాపులను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా బియ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. రేషన్ షాపులకు అధ్వానమైన బియ్యం సరఫరా చేశారని, దీంతో కొంతమంది వినియోగదారులు తీసుకోవడం లేదని డీలర్లు అధికారులకు వివరించారు. ఈ బియ్యాన్ని శాంపిల్ తీసుకొని ల్యాబ్‌కు పంపుతామని టెక్నికల్ అధికారి ప్రశాంత్ అన్నారు. బియ్యాన్ని తిరిగి పంపి మంచి వాటిని తెప్పిస్తామన్నారు. 50 కేజీల బస్తాలో తరుగు వస్తుందని డీలర్లు గోదాం ఇన్‌చార్జికి తెలిపారు.

ఎండు గంజాయి కేసులో..

పదేళ్లు జైలు, రూ.లక్ష చొప్పున జరిమానా



జైలుశిక్ష పడ్డ నిందితులు

నారాయణఖేడ్: ఎండు గంజాయి రవాణా కేసులో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జిల్లా ఫస్ట్ క్లాస్ అడిషనల్ జడ్జి కె.జయంతి తీర్పునిచ్చారని నారాయణఖేడ్ ఎక్సైజ్ సీఐ రఘునాథ్ రెడ్డి శుక్రవారం తెలిపారు. కంగ్టి మండలం వాసర్ బిబ్యానాయక్ తండాకు చెందిన జాదవ్ బలరాం, నాగల్‌గిద్ద మండలం ఇరక్‌పల్లికి చెందిన జాదవ్ మారుతీ 2015 మార్చి 27న హైచర్ వాహనంలో అక్రమంగా 180 కిలోల ఎండు గంజాయిని తరలిస్తున్నారన్నారు. కల్హేర్ మండలం బీబీపేట మేయిన్ రోడ్డుపై పట్టుకొని కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసుకు సంబంధించి విచారణ జరిపిన జడ్జి ఒక్కొక్కరికి పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారన్నారు.

నచ్చిన పంటలు సాగు చేయండి

- అన్ని కుల వృత్తులకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశాం
- త్వరలోనే గౌరవెల్లి, గండిపల్లి ద్వారా సాగునీరు
- భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం
- మంత్రి పొన్నం ప్రభాకర్



పోతారం(జే) గ్రామంలో ఈత, తాటి మొక్కలను నాటుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఒక్క గుంట భూమి కూడా బీడు లేకుండా మునగ, డ్రాగన్, ఆయిల్ పామ్ ఇతర ఏ పంటలైనా రైతన్నలు సాగు చేసుకోవాలని రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 75వ వన మహోత్సవంలో భాగంగా అక్కన్నపేట మండలంలోని పోతారం (జే) గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమానికి శుక్రవారం మంత్రి హాజరై ఈత, తాటి మొక్కలను నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలోనే గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టుల ద్వారా సాగు నీరు రానుందని, మెట్టప్రాంత రైతుల ఏళ్ల కల నెరవేరనుందన్నారు. అదే విధంగా భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. అన్ని కులవృత్తుల వారికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని, కార్పొరేషన్లు సైతం ఏర్పాటు చేశామన్నారు. అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించేలా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రభుత్వం అన్ని రకాలుగా వ్యవసాయ సంబంధిత వాటికి అన్ని రకాలుగా సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య, హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి, ఏసీపీ వాసాల సతీష్, ఎంపీడీఓ భానోతు జయరాం, నాయకులు పాల్గొన్నారు.

మహా ఉద్యమంగా క్విట్ ఇండియా ఉద్యమం

హుస్నాబాద్: మహాత్మాగాంధీ నాయకత్వంలో మహా ఉద్యమంగా క్విట్ ఉద్యమాన్ని చేయడం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మంత్రి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. క్విట్ ఇండియా మహత్తర ఉద్యమాన్ని అందరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన విధంగా సమాజాన్ని కాపాడుకోవడానికి, మన సమస్యల పరిష్కారం కోసం అలానే వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ ఉద్యమ స్ఫూర్తితో రాబోయే కాలంలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలంటే మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, కాంగ్రెస్ నాయకులు చిత్తారి రవీందర్, మడప జైపాల్ రెడ్డి, యాదవ రెడ్డి, మైదంశెట్టి వీరన్న, తదితరులు, పాల్గొన్నారు.

రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ మోసం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి
- అన్నదాతల ఆవేదనపై రచ్చబండ



సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా 8 అంశాలపై హామీలను ఇచ్చి నేడు ఒక్క హామీని అమలు చేయలేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలో అన్నదాతల ఆవేదనపై రచ్చబండ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ, కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేలు, రైతు కూలీలకు ఏటా రూ. 12 వేలు అమలు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కలగానే మిగిలాయని అన్నారు. నకిలీ విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లాగే ప్రస్తుత రేవంత్‌రెడ్డి సర్కార్ వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో పెద్ద ఎత్తున రైతులతో కలిసి ధర్నా కార్యక్రమాలను చేపడుతామని పేర్కొన్నారు. రైతాంగానికి బీజేపీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు విభిషన్‌రెడ్డి, ఉమారాణి, తిరుమల రెడ్డి, ఎల్లు రాంరెడ్డి, గురువారెడ్డి, వెంకటరమణ, కుడిక్యాల రాములు, సురేశ్, నత్తి శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్‌యాదవ్, పంజాల అశోక్‌గౌడ్, శ్రీనివాస్, సంపత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మన్నే శేఖర్, సురేశ్, మహేశ్, వెంకట్రామ్‌రెడ్డి, ఏగొండ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోయిన దొంగలు

- ఐదు ఇళ్లలో చోరీ, మరో ఐదింటిలో చోరీకి యత్నం
- నగదుతోపాటు బంగారం, వెండి ఆభరణాలు అపహరణ
- భయాందోళనలో అంబర్‌పేట గ్రామస్తులు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వర్గల్(గజ్వేల్): తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా దొంగలు పంజా విసిరారు. వర్గల్ మండలం అంబర్‌పేట గ్రామంలో గురువారం అర్ధరాత్రి ఒకేసారి 10 ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి, గ్రామస్తుల కథనం మేరకు.. అంబర్‌పేట గ్రామస్తులు మన్నె స్వామి ఇంట్లో 2 తులాల బంగారం, 40 తులాల వెండి, రూ.20,000 నగదు, మన్నె రమేశ్ ఇంట్లో 50 తులాల వెండి, రూ.40,000 నగదు, కోడపర్తి ప్రకాశ్, ఇంద్రసేనారెడ్డి, కుమార్ ఇంట్లో నుంచి తులం బంగారం, 30 తులాల వెండి, రూ.10,000 నగదు దొంగిలించారు. మరో ఐదు ఇళ్ల తాళాలు పగులగొట్టినప్పటికీ ఎలాంటి వస్తువులు చోరీ కాలేదు. తెల్లవారుజామున చోరీ విషయం గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాలను గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి పరిశీలించారు. క్లూస్‌టీం సభ్యులు ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీసీ కెమెరా ఫుటేజీలో అనుమానితుడు..

చోరీ జరిగిన ఇళ్ల పరిసరాల్లో సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించిన పోలీసులకు అదే గ్రామానికి చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో కనబడ్డాడు. ఆ దిశగా పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలుస్తుంది. అనుమానితుడి ఇంటి నుంచి చోరీకి గురైన కొన్ని బంగారు, వెండి ఆభరణాలు రికవరీ చేసుకున్నట్లు సమాచారం. అతడు పరారీలో ఉన్నట్లు తెలుస్తుంది.

దుకాణాల తాళాలు పగులగొట్టి..

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో గురువారం రాత్రి రెండు దుకాణాల తాళాలు పగులగొట్టిన దుండగులు నగదు ఎత్తుకెళ్లారు. మణికంఠ ట్రేడర్స్ దుకాణంలో గత నెల ఇదే తేదీన చోరీ జరుగగా, సరిగా నెల రోజులకు లక్ష్మీ ట్రేడర్స్ దుకాణంలో సుమారుగా రూ.50 వేల నగదును దుండగులు అపహరించుకపోయారు.

జీడిపల్లిలో చోరీ

మనోహరాబాద్(తూప్రాన్): ఊరెళ్లిన వారి ఇంటిలో బంగారం, వెండి చోరీ చేసిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. జీడిపల్లి గ్రామానికి చెందిన గుండు ఉమా గురువారం ఊరికి వెళ్లి శుక్రవారం ఇంటికి రాగా గుర్తు తెలియని దొంగలు పడ్డారు. బీరువాలో పావుతులం బంగారం, 60 తులాల వెండి, చోరీ చేసినట్లు గుర్తించారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సూపర్ మార్కెట్‌కని వెళ్లి..

మహిళ అదృశ్యం

పటాన్‌చెరుటౌన్: మహిళ అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని ఇక్రిసెట్ కాలనీకి చెందిన స్వాతి(27) బీరంగూడ పరిధిలోని ఓ సూపర్ మార్కెట్‌లో పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. భర్త రాజు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. రాజు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మార్కెట్‌కు వెళ్లి వస్తానని చెప్పి వ్యక్తి..

న్యాల్‌కల్(జహీరాబాద్): వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని రత్నాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. హద్నూర్ పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అరుణ్ కుమార్(23) ఎనిమిదవ తేదీన సాయంత్రం బీదర్ మార్కెట్‌కు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబీలకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వెళ్లిపోతున్నానని లేఖ రాసి..

బెజ్జంకి(సిద్దిపేట): వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలోని రేగులపల్లె శివారులోని వెంకట్రావుపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన జాప స్వప్న (38) భర్త లక్ష్మారెడ్డి గతంలో మృతి చెందాడు. ఇద్దరి కూతుర్లకు వివాహం జరుగగా ఇంటి వద్ద ఒక్కరే ఉంటున్నారు. ఈమె తల్లి కనుకలక్ష్మి రెగుల పల్లె స్టేజీ వద్ద ఉంటూ ఓ ప్రైవేటు స్కూల్‌లో పని చేస్తుంది. కూతురు ఒక్కరే ఉంటుండటంతో ప్రతిరోజూ తన పని ముగిశాక ఆమె ఇంటికి వెళ్లేది. శుక్రవారం సాయంత్రం వెళ్లే సరికి స్వప్న కనబడలేదు. తన కోసం వెతుకొద్దని నేను వెళ్లిపోతున్నాని అని స్వప్న రాసిన లేఖ లభ్యమైంది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత..



రుక్మిణి (ఫైల్)

వర్గల్(గజ్వేల్): మండల కేంద్రంలో వివాహిత అదృశ్యమైంది. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. వర్గల్‌కు చెందిన చెక్కల వెంకటేశ్, రుక్మిణి (32) దంపతులు గురువారం రాత్రి గొడవపడ్డారు. రాత్రి ఇంట్లో నిద్రపోయారు. శుక్రవారం ఉదయం లేచి చూసేసరికి రుక్మిణి కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వెంకటేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పార్ట్ టైమ్ జాబ్ పేరుతో..

రూ.6.50 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

తూప్రాన్: ఆన్‌లైన్ జాబ్ పేరుతో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో మరో వ్యక్తి బలి అయ్యాడు. ఎస్‌ఐ శివానందం శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి జూలై 16న టెలిగ్రామ్ యాప్‌లో ఆన్‌లైన్ పార్ట్ టైమ్ జాబ్ కింద ప్రొడక్ట్ బిజినెస్ అనే లింకు వచ్చింది. లింకు ఓపెన్ చేసి సైబర్ నేరగాళ్లు అడిగిన సమాచారం ఇచ్చాడు. 18వ తేదీ నుంచి వారు చెప్పిన విధంగా పలు దఫాలుగా రూ.6.50 లక్షలు పంపించాడు. తన బ్యాంకు ఖాతాలో రూ.10 లక్షలు జమైనట్లు గుర్తించిన బాధితుడు వాటిని విత్ డ్రా చేసుకుంటే డబ్బులు రావడం లేదు. మరో రూ.5 లక్షలు పంపిస్తే విత్ డ్రా చేసుకోవచ్చని నమ్మబలికారు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

సిద్దిపేటరూరల్: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని చింతమడక గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చింతమడక గ్రామానికి చెందిన పెద్దెల్లిగారి జగదీశ్ (23), సుష్మిత దంపతులకు ఇటీవల కూతురు పుట్టి చనిపోయింది. జగదీశ్ మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో భార్య తల్లిగారింటికి వెళ్లిపోయింది. కూతురు పుట్టి చనిపోవడం, భార్య అత్తగారింటికి వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన జగదీశ్ శుక్రవారం ఇంట్లో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అపూర్వరెడ్డి తెలిపారు.

తండ్రిని చంపింది కొడుకే

హత్యను కేసును ఛేదించిన పోలీసులు



నిందితులను పట్టుకున్న పోలీసులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని వరికోలు గ్రామంలో సంచలనం సృష్టించిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. కన్న కొడుకే మరి కొంత మందితో కలిసి హత్య చేసినట్లు నిర్ధారించారు. పోలీసుల కథనం మేరకు.. తరచూ మద్యం సేవించి అందరితో గొడవలు పడుతూ పరువు తీస్తున్నాడని తండ్రిపై కుమారుడు కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో కొడుకు జావెద్, బామ్మర్ది హాజీబాబ, అతడి సడ్డకుడు ముస్తాఫా, ఆటో డ్రైవర్ అంకుశ్ కూరెళ్ల గ్రామంలో అనుమానంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకొని విచారించగా హత్య తామే చేసినట్టు ఒప్పుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టుపై సీసీ కెమెరాలు మాయం

అధికారుల పర్యవేక్షణ గాలికి



ధ్వంసమైన సీసీ కెమెరా

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టు కట్టపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఒక్కొక్కటిగా మాయమవుతున్నాయి. ఎన్జీటీ ఆదేశాల మేరకు గతంలో సుమారుగా 8 సీసీ కెమెరాలను గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(జీఆర్ఎంబీ) అధికారులు ఏర్పాటు చేశారు. కొన్ని నెలల కిందట కుందనవానిపల్లి గ్రామానికి వెళ్లే దారిలో కట్టపైకి ఎక్కే వద్ద ఒక సీసీ కెమెరాను ఎత్తుకెళ్లగా, ప్రస్తుతం ఏకంగా నాలుగు సీసీ కెమెరాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు

ఎలాంటి పనులు చేపట్టొదని ఏర్పాటు..

గౌరవెల్లి ప్రాజెక్టు సామర్థ్యం 1.41 టీఎంసీలకు అనుమతి ఉండగా దాన్ని 8.23 టీఎంసీలకు పెంచారని, ఇందుకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని డిమాండ్ చేస్తూ ముంపు గుడాటిపల్లి గ్రామవాసులు, పలువురు భూ నిర్వాసితులు ఎన్జీటీని ఆశ్రయించిన విషయం తెలిసిందే. ప్రాజెక్టుపై ఎలాంటి పనులు చేయొద్దని, ఎప్పటికీ నిఘా ఉండేలా సోలార్‌తో నిరంతరం పని చేసేలా సీసీ కెమెరాలను అమర్చారు. ఈ ప్రాజెక్టు కట్టపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సీసీ కెమెరాలను ఆకతాయిలు ధ్వంసం చేస్తున్నారు. వెంటనే అధికారులు పర్యవేక్షించి సీసీ కెమెరాలను కట్టపై తక్షణమే ఏర్పాటు చేయాలని ముంపు గుడాటిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బద్దం రాజిరెడ్డి డిమాండ్ చేశారు.

ప్రకృతిని ఆరాధించే ఎన్ఆర్ఐ

- 20 రకాలుగా 2,000 మొక్కల పెంపకం
- సేంద్రియ పంటలు, కూరగాయలు సాగు
- 85 ఏళ్ల వయస్సులోనూ జోరుగా వ్యవసాయ పనులు
- మొక్కల చుట్టూ స్వచ్ఛదనం, ఆహ్లాదకర వాతావరణం
- రైతులకు సాయం చేస్తున్న తోటపల్లి గ్రామానికి చెందిన మురళీధర్‌రావు



మామిడి మొక్క నాటి, తోట వద్ద మురళీధర్‌రావు



ప్రకృతి ద్వారం

హుస్నాబాద్‌రూరల్: స్వదేశంలో పుట్టి పెరిగిన వారు ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లి అక్కడే స్థిరపడ్డవారు ఎందరో ఉన్నారు. విదేశాల్లో ఉద్యోగ విరమణ చేసిన తర్వాత పుట్టిన ఊరిలో ఉండాలని కొందరు, పుట్టిన ప్రాంతానికి సేవలందించాలని మరికొందరు అనుకుంటారు. ఆ కోవలోనే హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామానికి చెందిన జనగామ మురళీధర్‌రావు 40 ఏళ్ల కిందటనే అమెరికాకు వెళ్లాడు. కుటుంబం అంతా అక్కడే స్థిరపడినా వృద్ధాప్యంలో పుట్టిన ఊరికి సేవా చేయాలనే ఆకాంక్షతో 2019లో విదేశాల్లో నుంచి తిరిగొచ్చాడు. ఐదేళ్ల నుంచి పుట్టిన ఊరిలోనే ఉంటూ స్థానిక రైతులకు సహాయ పడుతుడూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.

ఊరికి దూరంగా ఉద్యానవనాలు


ఊరికి దూరంగా ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు సమీపంలో సొంతగా ఉన్న మూడు ఎకరాల వ్యవసాయ భూమిలోనే నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. రెండు ఎకరాల్లో కొబ్బరి, మామిడి, నేరడు, దానిమ్మ, జామ, బొప్పాయి, సపోట, ద్రాక్ష, నిమ్మ ఇలా 20 రకాలకు సంబంధించి 2,000 మొక్కలను పెంచుతున్నాడు. ఉద్యానవనంతో ఆహ్లాదకర వాతావరణం సృష్టించాడు. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి వరకు మొక్కల సంరక్షణను దగ్గరుండి చూసుకుంటాడు. పచ్చదనం చోటే స్వచ్ఛదనం ఉండాలని చెట్ల చుట్టూ కలుపు మొక్కలు లేకుండా తీసి వేస్తాడు. ప్రకృతి సృష్టికి ఎంత డబ్బు అయినా ఖర్చు చేసి పల్లె ప్రజలకు స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందించాలనే ఆలోచనతో పచ్చదనం సృష్టిస్తున్నాడు.

సేంద్రియ పంటలే ఆహారం..

మార్కెట్‌లో దొరికే పండ్లు, కూరగాయలను అందరూ వాడుతారు. ఎన్ఆర్ఐ మురళీధర్‌రావు తన పొలంలో సేంద్రియ పద్ధతిన పండించిన పంటలనే ఆహారంగా తీసుకుంటాడు. 85 ఏళ్ల వయస్సులోనూ రోజు 2 కిలో మీటర్లు నడుస్తాడు. సొంతంగానే కారు డ్రైవింగ్ చేసుకుంటాడు. తన పిల్లలు అందరూ అమెరికాలో ఉన్నప్పటికీ పల్లె ప్రకృతి ఒడిలోనే ఆహ్లాద వాతవరణం దొరుకుతుందని ఇక్కడే ఉంటాడు.

రైతులకు ఆర్థిక సేవలు..

వ్యవసాయ కుటుంబంలో పుట్టిన మురళీధర్‌రావు రైతులకు సాయం చేయాలని రైతు సేవా సమితి ఏర్పాటు చేశాడు. రైతుల కోసం సంస్థకు తన కుటుంబ సభ్యులతో రూ.4 లక్షల వరకు విరాళం ఇప్పించాడు. అలాగే, ఇతర ఎన్ఆర్ఐల సహకారంతో రూ.15 లక్షల వరకు సేకరించి రైతులకు రుణాలు ఇప్పిస్తున్నాడు. రైతు సేవా సమితి ద్వారా రైతులకు ఒక్కొక్కరి రూ.50 వేల నుంచి లక్షల వరకు రుణాలను ఇప్పించి పాల ఉత్పత్తిని పెంచుతున్నాడు. ఆర్థిక అవసరాలు తీరడంతోపాటు గ్రామంలో రైతు సేవా సమితి ఆర్థిక ప్రగతి సాధనకు పరోక్షంగా పునాదులు వేశాడు.

> **పుట్టిన ఊరికి సేవ చేయాలని..**
>
> 
>
> కొబ్బరి తోటలో..
>
> పల్లెటూరులో వ్యవసాయ కుటుంబాల కరువు కష్టాలను చూసి ఉద్యోగం చేయాలని పిల్లలను వ్యవసాయానికి దూరంగా ఉంచాలని ఊరు విడిచి వెళ్లిన. 40 ఏళ్ల కిందనే కొడుకు, కూతురు కుటుంబాలు అమెరికాలోనే స్థిరపడ్డారు. నేను 2018 వరకు 30 ఏళ్లు అమెరికాలోనే చిన్న ఉద్యోగం చేశాను. ఐదేళ్ల కిందటే సొంత ఊరికి రావాలని వ్యవసాయ రైతులకు సహాయం చేయాలని వచ్చాను. 5 ఏళ్లుగా 2,000 మొక్కలు పెంచాను. ప్రతీ ఏటా కొన్ని మొక్కలు తెచ్చి నాటుతాను.
>
> – జనగామ మురళీధర్‌రావు, ప్రవాస భారతీయుడు

పేకాట రాయుళ్ల అరెస్టు

18 మందిపై కేసు నమోదు

వట్‌పల్లి(అందోల్): అందోలు మండలం ఎర్రారం గ్రామంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న వారిని శుక్రవారం అరెస్టు చేసి జోగిపేట కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు జోగిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం రావడంతో వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9వేల నగదు, పది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన సుధాకర్, పీ.మల్లేశం, అశోక్, లింగయ్య, యాదయ్య, గంగయ్య, మొగులయ్య, పోచయ్య, నరేశ్, యాదాగౌడ్, మల్లేశం, టీ.కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే, వట్‌పల్లి మండలం ఖాదిరాబాద్‌లోని డెయిరీ ఫామ్‌లో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులు పెద్దాపురం సాయిలు, పెద్దగొల్ల సాయిలు, కలాలి శ్రీనివాస్‌గౌడ్, బీ.యాదయ్య, పల్లె శబ్బీర్ మియా, దాసరి లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకున్నామని ఏఎస్‌ఐ విఠల్ తెలిపారు.

విధులకు వెళ్లి విద్యుదాఘాతంతో మృతి

పటాన్‌చెరు టౌన్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హరి నారాయణ(28) రెండేళ్ల కిందట బతుకుదెరువు కోసం వచ్చి పాశమైలారంలో ఉంటున్నాడు. ఇక్కడే పారిశ్రామిక వాడలోని మెటల్ క్రాఫ్ట్ కంపెనీలో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం డ్యూటీకి వెళ్లిన హరి నారాయణ పరిశ్రమలోని పెయింటింగ్ రూమ్‌లో కేబుల్ వైర్ తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.